# సన్నబియ్యం.. వెన్నులో వణుకు..

- సన్నం బియ్యం ధరలకు రెక్కలు
- వారంలోనే క్వింటాల్‌కు రూ.800 పెంపు
- కిలో రూ.52 నుంచి రూ.60కి పైనే
- కొనలేని స్థితిలో సామాన్యులు
- 'బ్లాక్ మార్కెట్' వల్లే ఈ దుస్థితికి కారణమంటూ ఆరోపణలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నపాలు

హనుమకొండ, డిసెంబర్ 14 : బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. వారం రోజుల్లోనే క్వింటాల్‌పై సుమారు రూ.800 దాకా పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ పండించిన సన్నాలను ఇతర రాష్ర్టాలకు తరలిస్తుండడం, మిల్లర్లు, స్టాకిస్టులు, దళారులు నేరుగా రైతుల వద్ద సన్న బియ్యాన్ని కొని 'స్టాక్' చేస్తూ ధరలు నిర్ణయిస్తుండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని మిల్లర్లు, స్టాకిస్టులు, బియ్యం వ్యాపారులు భారీగా ధరలు పెంచుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది క్వింటాల్ బియ్యం రూ.3వేలు ఉంటే ఇప్పుడు రూ.4వేల నుంచి రూ.6,500 వరకు పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. మార్కెట్‌లో పాతవి జై శ్రీరాం కిలో బియ్యం రూ. 80, సోనా మసూరి రూ.64, హెచ్ఎంటీ రూ. 64 ఉండగా కొత్త బియ్యం రూ. 52 నుంచి రూ. 60, విజయ మసూరి లాంటి వాటికి రూ. 40 నుంచి రూ. 50 వరకు ధర పలుకుతోంది. ముందుందు కిలో బియ్యం ధర రూ. 100కు చేరే అవకాశముందని రైస్ మిల్లర్లు అంటున్నారు. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు.

### సన్నాలకు పెరిగిన డిమాండ్

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సన్నాలకు చీడ, తెగుళ్లు సోకి దిగుబడి తక్కువ రావడం, ఇతర రాష్ర్టాల్లో సన్నాలను పండించక పోవడం, మన రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం లాంటి ప్రాంతాల్లో దిగుబడి తగ్గడం, ఒక్క గోదావరి బెల్టులోనే సన్నాలు పండుతున్నా సరిపడా అందుబాటులోకి రాకపోవడం, రోజురోజుకూ డిమాండ్ పెరగడంతో మిల్లర్లు, స్టాకిస్టులు, వ్యాపారులు సన్న బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బియ్యం ధరలపై సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే వ్యాపారులు ధరలు పెంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నరకం ధాన్యం కొత్తవి క్వింటాల్‌కు రూ.3వేలు, పాతవి రూ. 3,700 ఆల్‌టైమ్ రికార్డుకు చేరాయని ఓ రైస్ మిల్లర్ తెలిపారు. రోజురోజుకూ బియ్యం ధర ఇలా అమాంతం పెరుగుతుంటే కొనేది ఎట్లా అని సామాన్యులు వాపోతున్నారు.

### కొనుగోళ్లు తగ్గినయ్..



పదిహేను రోజులుగా బియ్యం వ్యాపారం తగ్గింది. రోజురోజుకూ సన్న బియ్యం ధరలు భారీగా పెరుగుతుండడంతో కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. రోజుకు సుమారు 15క్వింటాళ్ల వరకు అమ్మేవాళ్లం. ఇపుడు 5 క్వింటాళ్లుకూడా అమ్మడం లేదు. బియ్యం ధర రోజుకు రూ.వంద నుంచి రూ.200దాకా పెరుగుతోంది.

– జనగాం శ్రీధర్ గౌడ్, బియ్యం వ్యాపారి, వడ్డేపల్లి

### వినియోగం పెరగడం వల్లే..

సన్న బియ్యం వినియోగం పెరగడం వల్లే ధరలు పెరుగుతున్నాయి. డిమాండ్‌కు తగినట్లుగా సన్నాలు అందుబాటులో లేవు. రైతులు దొడ్డు రకాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇతర రాష్ర్టాలు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో సన్నరకం ధాన్యం దిగుబడి సైతం తగ్గిపోయింది.

– ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ

### సన్న బియ్యం కొనలేని పరిస్థితి..



ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు చూస్తుంటే భయమవుతోంది. సామాన్యులు అసలు సన్న బియ్యం కొనలేని పరిస్థితి వచ్చింది. గత సంవత్సరం కిలో బియ్యం రూ. 30 ఉంటే ఇప్పుడు రూ.60కి పైనే ఉంది. ఇంత రేటు పెట్టి ప్రజలు బియ్యం ఎలా కొంటారు? ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి అందరూ ఇబ్బంది పడుతున్నారు. తినే బియ్యం కూడా కొనలేని పరిస్థితి వస్తే ఎట్లా బతుకుడు? అధికారులు చొరవ తీసుకొని బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చూడాలి. సామాన్యులకు అందుబాటు ధరకే సన్న బియ్యం దొరికేలా చూడాలి.

సంపతి రఘు, హనుమకొండ

## ఈజీఎస్ పనులకు కూలీలను రప్పించాలి

కాటారం, డిసెంబర్ 14 : మండలంలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేయించడంతోపాటు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులు, తెలంగాణకు హరితహారం నర్సరీల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నర్సరీల ఏర్పాటుకు మట్టి సేకరణ, జలదూత్, భువన్ యాప్, క్యాప్చరింగ్, ఆధార్ సీడింగ్ చేయాలన్నారు. టీఏలు, ఎఫ్ఏలు ఈజీఎస్ పనులను సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో వెంకన్న, టీఏలు రవళి, మనోజ్, రవి, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రుణ లక్ష్యాలను అధిగమించాలి

కాటారం, డిసెంబర్ 14 : బ్యాంకర్లు రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జేఎంఎల్‌బీసీ సమావేశంలో పలు బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, ఐకేపీ ఏపీఎంలు, సీసీలకు దిశా నిర్దేశం చేశారు. ఇచ్చిన రుణ లక్ష్యాలను చేరుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలను ఇవ్వడమే కాకుండా ఎన్‌పీఏ లేకుండా 100 శాతం రికవరీ జరిగేలా చూడాలన్నారు. రుణ గ్రహీతలతో పాటు బ్యాంకు ఖాతాదారులకు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌బీఐ, కేడీసీసీ, టీజీబీ అధికారులు సాయిరాం, హరిరాం నాయక్, వెంకట్రాజం, అవినాష్, పలు మండలాల ఐకేపీ ఏపీఎంలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

కృష్ణకాలనీ, డిసెంబర్ 14; కాంగ్రెస్ యూత్ భూపాలపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అప్పాల శ్రీనివాస్ భార్య రజిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండం శ్రీకాంత్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నగునూరి రజినీకాంత్, ఉడుత మహేందర్, ఉప్పుగల్ల కిషోర్‌రెడ్డి, బెంబడి సురేశ్, తోట రంజిత్, ప్రవీణ్, బొతు విజయ్, బామాండ్లపెల్లి అశోక్, కసాని రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్ఎం హాస్టల్ మంజూరు చేయాలి

ములుగు రూరల్, డిసెంబర్ 14 : జిల్లా కేంద్రంలో ఎస్సీ స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్ (ఎస్ఎంహెచ్)ను ప్రభుత్వం మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాజేడు, వెంకటాపురం (నూగూరు), కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి ప్రాంతాల నుంచి చదువుకునేందుకు జిల్లా కేంద్రానికి విద్యార్థులు వస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఎస్సీ ఎస్ఎంహెచ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, రూములు అద్దెకు తీసుకొని విద్యనభ్యసిస్తున్నారని వాపోయారు. ఎస్ఎంహెచ్ కోసం విద్యార్థులతో పోరాటం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దుర్గం యుగేందర్, కోగిల బాలేశ్వరి, మందపల్లి స్వామి, కావేరి బైరస్, జాగటి రవితేజ తదితరులు పాల్గొన్నారు.



మంగపేట : ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు



వెంకటాపురం(నూగూరు) : ఆటో కార్మికుల ర్యాలీ

# ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

మంగపేట, డిసెంబర్ 14 : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సీపీఎం మండల సీనియర్ నాయకుడు నర్రా శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించగా, సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల మహిళలెవరూ ఆటోల్లో ప్రయాణించడం లేదన్నారు. దీంతో అనేక ఏళ్లుగా ఆటోలనే నమ్ముకున్న డ్రైవర్లందరూ జీవనోపాధి కోల్పోయి వీధిన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆటో డ్రైవర్లను తగిన విధంగా ఆదుకునే దిశగా సహాయాన్ని అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారమయ్యేంతవరకు వారికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. తాము ప్రతినెలా ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతున్నదని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పలు గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### వెంకటాపురం (నూగూరు)లో..

వెంకటాపురం (నూగూరు) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆటో డ్రైవర్లు గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక శివాలయం సెంటర్ నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటో కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తమ జీవనోపాధి దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని రద్దు చేసి తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, మద్దుకూరి అనిల్, రాజు, సమ్మయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారి నుంచి అభిప్రాయాన్ని సేకరిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, విద్యార్థులు

## డిజిటలైజేషన్ ప్రభావం ఎలా ఉంది?

### విద్యార్థుల అభిప్రాయ సేకరణ

ములుగు, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక స్థితిగతులపై డిజిటలైజేషన్ ప్రభావం ఎలా ఉంది? అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు గురువారం జిల్లా కేంద్రంలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రొఫెసర్ డాక్టర్ రాపుల కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు సాక్షి, పోపిదేవి, రాంబాబు, ప్రశాంత్‌తో కూడిన బృందం ములుగులోని కూరగాయలు, కిరాణా, చిరు వ్యాపారులతో పాటు రైతులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను అధ్యయనం చేసేందుకు ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ములుగు పరిసర గ్రామీణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు, యువకులు, మహిళలు, రైతుల దైనందిన జీవితంలో సామాజిక, ఆర్థిక స్థితిగతులపై డిజిటలైజేషన్ ఏ మేరకు ప్రభావం చూపిస్తుంది, దానివల్ల కలిగే లాభ నష్టాలు తెలుసుకుంటున్నట్లు వివరించారు. అలాగే వృత్తి, ఆరోగ్య, వ్యాపార, విద్య, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో డిజిటలైజేషన్‌తో వస్తున్న మార్పులపై కూడా అధ్యయనం చేస్తున్నట్లు కృష్ణ వివరించారు.

## ఉన్నత విద్యనందించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు

రేగొండ, డిసెంబర్ 14 : ఉపాధ్యాయులు విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని ఉన్నత విద్యను బోధించాలని తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకుడు మనోహరాచారి అన్నారు. మండలంలోని రంగయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. అభ్యసన అభివృద్ధి, అనుసరించాల్సిన పద్ధతులపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట లక్ష్మణ్, మధు, రామయ్య, షర్మిల, ప్రభాకర్ తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


మల్హర్, డిసెంబర్ 14 : మండలంలోని రుద్రారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంగెం రమేశ్, సుంకు రామన్న, మాచర్ల సురేశ్, బుడిగె వెంకటేశ్ పాల్గొన్నారు.

## 3వ రోజుకు పోస్టల్ సిబ్బంది సమ్మె

ములుగు రూరల్, డిసెంబర్ 14 : ములుగు జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయం ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం 3వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఉద్యోగులు తపాలా కార్యాలయం ఎదుట దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తీర్చాలని కోరారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వివరించారు. ఈ శిబిరంలో సుజాత, ఇందిర, లిఖిత, సాహిత్య, స్వరూప, ఎం ఆనందం, రజినీకాంత్, జీ ఆనందం, రాధాకృష్ణన్‌రావు, నాగరాజు, సాయికుమార్, సురేందర్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చొని నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు



విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో రఘుపతి

## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చిట్యాల, డిసెంబర్ 14 : పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి కోడపాక రఘుపతి సూచించారు. గురువారం మండలంలోని చల్లగరిగ, చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను వినియోగించుకోవాలన్నారు. వార్షిక పరీక్షలంటేనే విద్యార్థులకు కొంత భయం, ఒత్తిడి ఉంటుందని, వాటిని దూరం చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు తదితరులున్నారు.